సాక్షి
కుమురం భీం

బుధవారం । 26 । ఏప్రిల్ । 2023



పనిచేయని నిఘా నేత్రం

కౌటాలలో నిఘా నేత్రాలు నిర్వహణ సరిగా లేక అలంకారప్రాయంగా మారాయి. నాలుగేళ్ల క్రితం కూడళ్లలో పది సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 9లో▸



లోతు తెలియని ఈత !

వేసవి సెలవుల్లో 'ఈత ప్రమాదాలు' విషాదం నింపుతున్నాయి. చిన్న పాటి నిర్లక్ష్యంతో చిన్నా, పెద్దా తేడా లేకుండా అనేకమంది మృత్యువాత పడుతున్నారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.7 /23.7

ఆకాశం కొంతమేర మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. వేడి, ఉక్కపోత తగ్గుతుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లాకు మరో ఐదు రోజులు వర్షసూచన

బెల్లంపల్లి: అల్పపీడన ప్రభావంతో వచ్చే ఐదు రోజులపాటు మంచిర్యాల, కుమురం భీం జిల్లాల్లో ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎం.రాజేశ్వర్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురవవచ్చని, ఐదు రోజుల్లో మంచిర్యాల జిల్లాలో అత్యధికంగా 50 నుంచి 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కానుందని పేర్కొన్నారు. కుమురంభీం జిల్లాలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని, ఐదు రోజులపాటు కురిసే వర్షాల వల్ల పంటలు పాడవకుండా రైతులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఉపయోగం ఉంటుందని తెలిపారు. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతోపాటు వడగళ్ల వర్షం కురిసే అవకాశాలు ఉండడం వల్ల రైతాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆలయ భూముల కౌలుకు వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కేశవనాథ స్వామి దేవస్థానం పరిధిలోని 90.7 ఎకరాల వ్యవసాయ భూమిని సంవత్సర కాలం పాటు కౌలుకు ఇచ్చేందుకు మంగళవారం వేలం నిర్వహించారు. స్థానిక బ్రాహ్మణవాడ ఆలయ ఆవరణలోని మినీ ఫంక్షన్ ఆలయంలో ఈవో వేణుగోపాల్ గుప్తా, ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో నిర్వహించిన వేలంలో ఆలయానికి రూ.17.77 లక్షల ఆదాయం సమకూరింది. గతేడాది కంటే రూ.7.97లక్షలు అధిక ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు నిమ్మకంటి సుగుణాకర్, వైరాగడే మనోజ్, అర్చకులు ఒజ్జల నరేశ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు వినియోగించుకోవాలి



జాబ్‌మేళాలో పాల్గొన్న నిరుద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఉపాధి అవకాశాలను నిరుద్యోగులు వినియోగించుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఉపాధి కల్పనశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, రాజేశంతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ మెగా జాబ్‌మేళాలో 1200 మంది నిరుద్యోగులు రిజిస్టర్ చేసుకోగా, 510 మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు తెలిపారు. హెటిరో డ్రగ్, హ్యాపీ మొబైల్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎస్‌బీఐ, అపోలో ఫార్మసీ, డిమార్ట్, రిలయన్స్ జియోమార్ట్, ముత్తుట్ గ్రూప్స్, అరబిందో ఫార్మా తదితర కంపెనీలు 3,500 ఉద్యోగాలు కల్పిస్తున్నాయని తెలిపారు. ఎంపికైన వారికి శిక్షణ తర్వాత ఉద్యోగాల్లోకి తీసుకుంటారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని అనేక కంపెనీల్లో అర్హతలకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. జిల్లాఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి మణెమ్మ, మైనార్టీ సంక్షేమ అధికారి షేక్ రబ్బానీ, ఎస్సీ కార్పొరేషన్ అధికారి సజీవన్, బీసీ సంక్షేమ శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవోలు, ఏపీఎంలు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (పెట్రోల్ పంపు)లో మంగళవారం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1983 నుంచి 1992 వరకు పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు సుమారు 150 మంది హాజరయ్యారు. జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠశాలలో వారికి బోధించిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువతో సన్మానించారు.

అకాల నష్టం

- జిల్లాలో నాలుగురోజులుగా వర్షాలు, వడగండ్లు
- మంగళవారం ఈదురుగాలులతో దెబ్బతిన్న ఇళ్లు, పంటలు
- పలు మండలాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం
- అంధకారంలోనే పల్లెలు



కెరమెరి: ఈదురుగాలులకు నేలవాలిన మొక్కజొన్న

కెరమెరి/ఆసిఫాబాద్‌అర్బన్/రెబ్బెన/పెంచికల్‌పేట్/చింతలమానెపల్లి: జిల్లాలో మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు రైతులతోపాటు సాధారణ ప్రజలకు తీవ్ర నష్టాన్ని మిగుల్చుతున్నాయి. వడగండ్ల వానతోపాటు ఈదురు గాలులు బలంగా వీస్తుండటంతో ఇళ్ల పైకప్పులు ఎగిరిపోతున్నాయి. కోతకు వచ్చిన పంటలు చేతికందకుండా పోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

- కెరమెరి మండల కేంద్రంతోపాటు ధనోరా, గోయగాం, ముర్కిలొంక, పార్ధ గ్రామాల్లో మంగళవారం కురిసిన అకాల వర్షం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. బలమైన ఈదురు గాలుల ధాటికి పలుచోట్ల ఇళ్ల పైకప్పుగా వేసిన రేకులు ఎగిరిపోగా, చెట్లు విరిగిపడ్డాయి. గంటపాటు కురిసిన వడగండ్ల వానకు జొన్న, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి.
- జిల్లా కేంద్రంలో సాయంత్రం నాలుగు గంటలకు ఒక్కసారిగా ఆకాశంలో మబ్బులతో కారుచీకట్లు కమ్ముకున్నాయి. ఎండలతో అల్లాడుతున్న ప్రజలు వాతావరణం చల్లబడటంతో రోడ్లపైకి వచ్చి సరదాగా గడిపారు.
- చిరుజల్లులతో కూడిన బలమైన ఈదురు గాలులు వీయడంతో రెబ్బెన, గోలేటిలో ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయి దూరంగా పడ్డాయి. మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి.

అంధకారంలో గ్రామాలు..

పెంచికల్‌పేట్ మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. మూడు రోజులుగా ఇదే పరిస్థితి ఉండటంతో వరికి తీవ్ర నష్టం వాటిల్లింది. విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో పెంచికల్‌పేట్, లోడుపల్లి, కొండపల్లి, అగర్‌గూడ, జైహింద్‌పూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మూడు రోజులుగా ప్రజలు అంధకారంలోనే ఉంటున్నారు. తాగునీరు, నిత్యావసర వస్తువుల కోసం ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- చింతలమానెపల్లి మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలు నష్టం వాటిల్లింది. గాలులతో విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో డబ్బా, బాబాసాగర్, ఆడెపల్లి, దరంపెల్లి, బారెగూడ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షాలతో విద్యుత్ సరఫరా మళ్లీ నిలిచిపోయింది. చాలా గ్రామాలు అంధకారంలోనే ఉండిపోయాయి.

సంతలో కల్లోలం

దహెగాం(సిర్పూర్): మండల కేంద్రంలో మంగళవారం సంత నిర్వహిస్తున్న సమయంలో ఒక్కసారిగా గాలివాన ప్రారంభం కావడంతో వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈదురు గాలులకు టార్పాలిన్లు ఎగిరిపోయి కూరగాయలు, అమ్మకానికి ఉంచిన వస్తువులు తడిసిపోయాయి.



వర్షానికి తడుస్తున్న కూరగాయలు, సామగ్రి

గోడ కూలి ఏడు మేకలు మృతి



మృతి చెందిన మేకలు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలో సాయంత్రం కురిసిన వర్షానికి బురదగూడ గ్రామంలో గోడ కూలి ఏడు మేకలు మృతి చెందాయి. సటారి దేవయ్యకు చెందిన నాలుగు మేకలు, కొట్రంగి నానయ్య, సాంబయ్య, మెర్లే విట్టులకు చెందిన ఒక్కో మేక మృత్యువాత పడ్డాయి. మరో మూడు మేకలకు గాయాలైనట్లు బాధితులు తెలిపారు. అడవి నుంచి ఇళ్లకు వస్తుండగా ఒక్కసారిగా వర్షం రావడంతో మేకలపై గోడ కూలిందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

'ప్రోత్సాహకం' జాడేది..?



గంగాపూర్‌లో హెచ్‌డీపీఎస్ విధానంలో సాగు చేసిన పత్తిని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

- 'హెచ్‌డీపీఎస్' పత్తి సాగు చేసిన రైతులకు అందని నగదు
- మరో రెండు నెలల్లో కొత్త పనులకు శ్రీకారం
- నిధులు విడుదల చేయాలని అన్నదాతల వేడుకోలు
- పెండింగ్‌లో రూ.20లక్షలు

రెబ్బెన(ఆసిఫాబాద్): గత వానాకాలంలో అధిక సాంద్రత విధానం(హెచ్‌డీపీఎస్)లో పత్తి సాగు చేసిన రైతులకు ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక నగదు అందలేదు. మరో రెండు నెలల్లో కొత్త సాగు సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు ఇప్పటికే పనులు మొదలుపెట్టారు. ప్రయోగాత్మకంగా పత్తి సాగు చేసిన వారికి ప్రోత్సాహకం అందకపోవడంతో ఈ ఏడాది కొత్తవారు హెచ్‌డీపీఎస్ సాగుకు వెనుకడుగు వేసే ప్రమాదం ఉంది.

మూడు మండలాల్లో సాగు..

జిల్లాలో మొదటిసారిగా అధిక సాంద్రత పత్తి సాగును మూడు మండలాల రైతులు చేపట్టారు. ప్రభుత్వం విత్తనాలు ఉచితంగా అందించింది. అలాగే ప్రోత్సాహక నగదును సైతం అందిస్తామని చెప్పడంతో పలువురు రైతులు మొగ్గుచూపారు. జిల్లాలో మొదటిసారిగా గతేడాది రైతులు అధిక సాంద్రత పత్తి సాగు చేసేందుకు ముందుకువచ్చారు. సంప్రదాయ పత్తి సాగుతో పోల్చితే ఈ విధానంలో విత్తనాలు అధికంగా అవసరం ఉంటుంది. దీంతో రైతులకు కావాల్సిన విత్తనాలను వ్యవసాయ శాఖ ఉచితంగా పంపిణీ చేసింది. విత్తనాలతోపాటు ఎకరానికి రూ.4వేల చొప్పున నగదు ప్రోత్సాహం సైతం అందిస్తామని ప్రకటించారు. రెబ్బెన, కెరమెరి, వాంకిడి మండలాల్లో 500 ఎకరాల్లో ఈ విధానంలో పత్తి సాగు చేపట్టారు. అయితే ప్రోత్సాహక నగదు మాత్రం నేటికీ రైతులకు చేరలేదు. రూ.20లక్షల నగదు పెండింగ్‌లో ఉంది. సీజన్ మధ్యలోనే వ్యవసాయశాఖ రైతుల బ్యాంకు ఖాతాలు, సాగు వివరాలను ప్రభుత్వానికి నివేదించింది.

నెలలుగా ఎదురుచూపులు..

గతేడాది అధిక సాంద్రత పత్తి సాగు చేపట్టిన రైతులు ప్రభుత్వం నుంచి అందాల్సిన నగదు కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. మరో రెండు నెలల్లో సీజన్ ప్రారంభం కానుండటంతో ఇప్పుడైనా ప్రభుత్వం అందిస్తే సాగు ఖర్చులకు ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ కోసం వ్యవసాయ భూములను సిద్ధం చేసే పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. పత్తికట్టెను తొలగించడం, వేసవి దుక్కి దున్నడం వంటి పనులు చేపడుతున్నారు. కనీసం ఈ సమయంలోనైనా ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక నగదు అందితే ట్రాక్టర్ కిరాయిలు, కూలీల ఖర్చులకు ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. మరో నెల రోజుల్లో పత్తి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈసారి జిల్లాలో అధిక సాంద్రత పత్తి సాగును దాదాపు రెండు వేల ఎకరాలకు విస్తరించాలని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. గత సీజన్‌కు సంబంధించిన నగదు ఇంకా రైతులకు అందకపోవడం వారికి తలనొప్పిగా మారింది.

నిధులు విడుదల కాలేదు



జిల్లాలో గత సీజన్‌లో అధిక సాంద్రత పత్తి సాగు చేపట్టిన రైతులకు నగదు ప్రోత్సాహకం ఇంకా అందని మాట వాస్తవమే. అయితే రైతులకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు, వారు సాగు చేసిన భూమి విస్తీర్ణం వివరాలన్నీ ప్రభుత్వానికి అందించాం. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక నగదు విడుదల కావాల్సి ఉంది. నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలోనే నగదు జమ అవుతుంది.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

మలేరియా నిర్మూలనకు సమన్వయంతో పనిచేద్దాం

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా మలేరియా నిర్మూలనకు సమన్వయంతో పనిచేద్దామని కలెక్టర్ హేమంత్ బోర్కడే పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో మంగళవారం జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమానికి డీఎంహెచ్‌వో రామకృష్ణతో కలిసి హాజరయ్యారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ డబ్ల్యూహెచ్‌వో సూచనల మేరకు 2030 నాటికి మలేరియాను పూర్తిగా నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రైడేలు పాటించాలన్నారు. దోమ తెరలు విధిగా వినియోగించాలన్నారు. మలేరియా సోకినట్లు అనుమానం ఉంటే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, వైద్యులు సత్యనారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

పోషకాహార పంపిణీకి పకడ్బందీ చర్యలు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో రక్తహీనతను నిర్మూలించేందుకు పోషకాహార పంపిణీ పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా శిశు సంక్షేమ, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఢిల్లీ నుంచి వచ్చిన ఏఎంసీ ప్రతినిధులతో కలిసి అంగన్‌వాడీ సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 900 అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ కేంద్రంలో బాలామృతం పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతీవారం పిల్లల బరువు, ఎత్తును పరిశీలించి, తక్కువ ఎత్తు ఉన్న వారి ఎదుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గర్భిణుల కోసం పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. అనంతరం ఢిల్లీ నుంచి వచ్చిన ప్రతినిధులను శాలువాతో సన్మానించారు.



పోషకాహార పంపిణీపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు

ఆసిఫాబాద్‌అర్బన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతీ మంగళవారం, శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు బీఆర్‌ఎస్ శ్రీరామరక్ష

- మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు
- జిల్లా కేంద్రంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ స్థాయి ప్రతినిధుల సభ
- హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు



నారదాసు లక్ష్మణరావును సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు, తదితరులు

ఆసిఫాబాద్: తెలంగాణ రాష్ట్రానికి బీఆర్‌ఎస్ పార్టీయే శ్రీరామరక్ష అని మాజీ ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని టాటియా గార్డెన్‌లో మంగళవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు అధ్యక్షతన నిర్వహించిన ఆసిఫాబాద్ నియోజకవర్గ స్థాయి ప్రతినిధుల సభకు జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా నారదాసు లక్ష్మణరావును శాలువతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీమాంధ్ర దోపిడీ నుంచి విముక్తి కోసం, తెలంగాణ ప్రజల అవసరాలు, ఆకాంక్షలతోనే టీఆర్‌ఎస్ పుట్టిందన్నారు. సీత శోకం లంకాదహనానికి ఎలా కారణమైందో.. తెలంగాణ ప్రజల బాధలు రాష్ట్ర ఆవిర్భావానికి కారణమయ్యాయని పేర్కొన్నారు. అమరుల త్యాగాలు, విద్యార్థుల బలిదానాలు, సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ సిద్ధించిందన్నారు. సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు మాట్లాడుతూ కేసీఆర్ ఇంట్లో నుంచి ఇవ్వడం లేదంటున్నాయని, గతంలో కాంగ్రెస్, బీజేపీలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం ఆ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా తెలంగాణ తరహా పథకాలు అమలు చేయడం లేదన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా పెడుతున్న పోస్టులను పార్టీ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, భవిష్యత్తులో అందరికీ అవకాశం లభిస్తుందన్నారు. వైఎస్సార్‌టీపీ నాయకులు విజయమ్మ, షర్మిల పోలీసులపై చేయి చేసుకోవడాన్ని ఖండించారు. కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్క బీఆర్‌ఎస్‌పై చేసే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తెచ్చి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే సక్కు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి బీజేపీ అడ్డుపడే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రతిపక్షాల ఆరోపణలకు అభివృద్ధితోనే సమాధానం చెప్పాలన్నారు. 23 తీర్మానాలను ప్లీనరీలో ప్రవేశపెట్టి ఆమోదించారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. టాటియా గార్డెన్ ఎదుట ఏర్పాటు చేసిన తెలంగాణ అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. సమావేశంలో జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు, జెడ్పీటీసీలు అరిగెల నాగేశ్వర్‌రావు, సంతోష్‌కుమార్, అజయ్‌కుమార్, దుర్పత బాయి, చంద్రశేఖర్, ఎంపీపీ మల్లికార్జున్, ఏఎంసీ చైర్మన్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలి

కాగజ్‌నగర్‌రూరల్: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణరావు అన్నారు. కాగజ్‌నగర్ మండలం ఈస్‌గాం శివమల్లన్న ఆలయ ఆవరణలో మంగళవారం సిర్పూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అవతరించి 22 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 27న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు కొనప్ప మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు బీటీ రోడ్లు, వాగులపై వంతెనల నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో కూడా అమలు చేయాలని తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ ఉమామహేశ్వర్‌రావు, ఎంపీపీలు దుబ్బుల నానయ్య, శంకర్, విశ్వనాథ్, నాయకులు సిద్ధిక్, కోనేరు వంశీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

క్లుప్తంగా

పిడుగుపడి ఎడ్లు మృతి

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామంలో మంగళవారం పిడుగుపాటుకు రైతు బండ పోచయ్యకు చెందిన రెండు ఎడ్లు మృతి చెందాయి. సుమారు రూ.60వేల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య



హరన్ మండల్ మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నంబర్–5 గ్రామానికి చెందిన హరన్ మండల్ (54) మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈస్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జగదీశ్ 14 ఏళ్లుగా విలేజ్ నంబర్–5 శివారులోని సొసైటీకి సంబంధించిన చేపల చెరువును వేలంలో దక్కించుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ ఏడాది వేలంలో చెరువు తనకు దక్కకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు విక్రం మండల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పంటల పరిశీలన



ముత్తరావుపల్లి గ్రామంలో వరి పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెర, ముత్తరావుపల్లి గ్రామాల్లో మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు వరి క్షేత్ర సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వరి సాగులో పాటించాల్సిన పద్ధతులు వివరించారు. చీడ, పీడల నివారణ చర్యల గురించి తెలిపారు. ఆయిల్‌పాం పంటను పరిశీలించి సాగు ప్రాముఖ్యతను వివరించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజేశ్వర్‌నాయక్, ఏడీఏ జాడి బాపు, ఏవో కవిత, వ్యవసాయ శాస్త్రవేత్తలు నాగరాజు, తిరుపతి, ఏఈవోలు సాగర్, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

దండేపల్లి: ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్న ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర మూడో మహాసభల పోస్టర్‌ను సేనా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కొట్నాక తిరుపతి వందుర్‌గూడలో ఆవిష్కరించారు. ఎస్టీ జాబితాలో మరో 11 కులాలను చేర్చాలనుకునే ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మహాసభకు ఆదివాసీ నాయకులు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కార్మికుల ఆరోగ్యానికి భరోసా

- కార్మిక సంక్షేమబోర్డు ఆధ్వర్యంలో ఉచిత వైద్యపరీక్షల శిబిరాలు
- భవన, ఇతర నిర్మాణరంగ కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- ఉచితంగా 50 రకాల పరీక్షలు



కార్మికుల నుంచి రక్త నమూనాలు తీసుకుంటున్న వెల్‌నెస్ సంస్థ వైద్యసిబ్బంది (ఫైల్)

పాతమంచిర్యాల: తెలంగాణ నిర్మాణ రంగ కార్మిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత వైద్యం అందించేందుకు రెండు నెలల క్రితం ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. కార్మికశాఖ ద్వారా లేబర్ గుర్తింపుకార్డు పొందిన కార్మికులకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించి వారి ఆరోగ్య స్థితిగతులు గుర్తించడానికి 50 రకాల పరీక్షలు నిర్వహిస్తోంది. వైద్యపరీక్షలు చేయించుకున్న కార్మికులకు రిపోర్టుల ఆధారంగా ఏదైన వ్యాధి లేదా దీర్ఘకాలిక వ్యాధులున్నట్లు నిర్ధారణ జరిగితే వారికి స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తారు. జిల్లాలోని 3,012 మంది లేబర్ కార్డులు పొందిన కార్మికులకు ఈ సేవలు అందించనున్నట్లు కార్మికశాఖ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఏఎస్ వినీత తెలిపారు. ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని, లేబర్‌కార్డు కలిగిన ప్రతీ కార్మికుడు సేవలు వినియోగించుకోవాలని సూచించారు.

ఇప్పటికే మంచిర్యాల మండలంలో..

జిల్లాలో ఇప్పటికే మంచిర్యాల మండల పరిధిలోని కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామాలు, మండల కేంద్రాల్లోనూ వైద్యపరీక్షలు నిర్వహించేందుకు శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతీ కార్మికుడు ఆరోగ్యంగా ఉండాలన్నదే కార్యక్రమ ఉద్దేశమని పేర్కొన్నారు. గ్రామాలు, మండల కేంద్రాల్లో నిర్వహించే వైద్యపరీక్షల శిబిరాలకు రాని వారి ఇంటికే వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు కార్మికశాఖ అధికారులు తెలిపారు. తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమబోర్డు, కామన్ సర్వీస్ సెంటర్ వెల్‌నెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కార్మికశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వైద్యపరీక్షల శిబిరాల్లో భవన నిర్మాణ సంఘాలు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, పెయింటింగ్ కార్మిక సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. కార్మికులకు ఎలాంటి అనారోగ్య సమస్యలున్నా వైద్యపరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ జరుగుతుందని, దీంతో సకాలంలో చికిత్స తీసుకుంటే ప్రాణాంతకం కాకుండా నిరోధించుకోవచ్చని అధికారులు తెలిపారు.

మే 1, 2, 3 తేదీల్లో శిబిరాలు

కార్మికులకు ఆరోగ్య సమస్య వస్తే ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వివిధ రకాల టెస్టులు చేయించుకుని ఖర్చుల పాలై ఆర్థికంగా నష్టపోతున్నారని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం భవన, ఇతర నిర్మాణరంగ కార్మిక సంక్షేమబోర్డు ఆధ్వర్యంలో ఉచితంగా 50 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తోంది. ఇవే పరీక్షలు ప్రైవేట్ ల్యాబ్‌ల్లో చేసుకుంటే రూ.15 వేల వరకు ఖర్చు అవుతుందని కార్మికశాఖ అధికారులు పేర్కొన్నారు. మే 1, 2, 3 తేదీల్లో మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి, చెన్నూర్, లక్సెట్టిపేట, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో మెగా వైద్యపరీక్షల శిబిరాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు కామన్ సర్వీస్‌సెంటర్ వెల్‌నెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజర్ రాజు తెలిపారు. లేబర్ కార్డు కలిగిన ప్రతీ కార్మికుడు వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

శిబిరాల్లో చేసే పరీక్షలివే..

వైద్యపరీక్షల శిబిరాల్లో కార్మికులకు అవసరమైన ప్రధాన టెస్టులన్నీ చేస్తారు. లంగ్‌ఫంక్షన్, ఆడియో స్క్రీనింగ్, విజన్‌స్క్రీనింగ్, బ్లడ్‌షుగర్, లివర్‌ఫంక్షన్, రీనల్ ఫంక్షన్ మూత్రపిండాల పనితీరు, లిపిడ్‌ప్రొఫైల్, యూరిన్, ఈఎస్సార్, థైరాయిడ్, జీజీటీపీ, హెచ్ఐవీ, హెపటైటిస్ బీ, సీవీడీఆర్ఎల్, బ్లడ్‌గ్రూపింగ్, విటమిన్ డీ 3, హెచ్‌బీఏ 1సీ, ఈసీజీ, కార్సినియో ఎంబ్రోయినిక్ ఆంటిజెన్ (సీఈఏ) తదితర పరీక్షలు చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



లేబర్‌కార్డు కలిగిన ప్రతీ నిర్మాణరంగ కార్మికుడు ప్రభుత్వం ఉచితంగా నిర్వహించే శిబిరాల్లో వైద్యపరీక్షలు చేయించుకుని రిపోర్టులు పొందాలి. ప్రతీ కార్మికుడు తన ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుని ఆరోగ్యవంతమైన జీవితం గడపాలి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలి. – వినీత, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, మంచిర్యాల

గని మేనేజర్‌గా బాధ్యతల స్వీకరణ



లక్ష్మీనారాయణకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రాజేందర్

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట–2 గని మేనేజర్‌గా మంగళవారం జీ లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రూప్ ఏజెంట్ కుర్మ రాజేందర్ లక్ష్మీనారాయణకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గని అధికారులు, కార్మికులు స్వాగతం పలికారు. మందమర్రి ఏరియా సేఫ్టీ అధికారిగా బదిలీపై వెళ్తున్న మేనేజర్ రవీందర్‌ను అధికారులు, కార్మికులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రక్షణాధికారి సంతోష్‌రావు, పిట్ ఇంజినీర్లు రఘు, నందకిశోర్, సంక్షేమాధికారి భార్గవ్, సర్వే అధికారి ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

విద్యుత్ ఆర్టిజన్ల సమ్మెకు ఐఎఫ్‌టీయూ మద్దతు

పాతమంచిర్యాల: విద్యుత్ ఆర్టిజన్ల సమ్మెకు ఐఎఫ్‌టీయూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని జాతీయ ప్రధాన కార్యదర్శి టీ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఆర్టిజన్లు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సమ్మె చేస్తే వారిపై ఎస్మా ప్రయోగించడం అన్యాయమని పేర్కొన్నారు. డిమాండ్లు పరిష్కరించకుండా సమ్మెను విచ్ఛిన్నం చేయడం, ఎస్మా ప్రయోగించడం మానుకోవాలని డిమాండ్ చేశారు.

త్వరలో రెండోవిడత గొర్రెల పంపిణీ




రికార్డులు పరిశీలిస్తున్న రమేశ్‌కుమార్

నెన్నెల: ప్రభుత్వం త్వరలో రెండోవిడత గొర్రెల యూనిట్లు పంపిణీ చేయనుందని, ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వై.రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం నెన్నెల పశువైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. మండలంలో 216 మంది గొర్రెల పెంపకందారులు రెండోవిడత గొర్రెల కోసం వాటాధనం చెల్లించాల్సి ఉందని తెలిపారు. లబ్ధిదారులు ఆధార్, నామినీ ఆధార్, బ్యాంక్ పాస్‌పుస్తకం, కుల ధ్రువీకరణ పత్రాలు జత చేసిన దరఖాస్తులను పశువైద్యాధికారులకు వెంటనే అందజేసి ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు వాటా ధనం కింద రూ.43,750 నేరుగా తమ ఖాతాల నుంచి కలెక్టర్ ఖాతాలో జమ చేయాలని తెలిపారు. లబ్ధిదారుల వాటాకు ప్రభుత్వం రూ.1,31,250 సబ్సిడీ వర్తింపజేస్తుందని పేర్కొన్నారు. జిల్లాకు రెండో విడత లక్ష్యం 4,138 యూనిట్లు కేటాయించినట్లు చెప్పారు. గొల్ల, కుర్మలు ఆరోగ్యకరమైన గొర్రెలు ఎంపిక చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. వేసవిలో జీవాల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను లబ్ధిదారులకు వివరించారు. రమేశ్‌కుమార్ వెంట పశువైద్యాధికారి దిలీప్, సిబ్బంది ఉన్నారు.

మట్టిదిబ్బల కింద మహాచరిత్ర

- మురిమడుగు గుట్టపై నేటికీ దర్శనమిస్తున్న 15వ శతాబ్దపు గుడి
- ఈ ప్రాంతాన్ని తొలి శాతవాహనులు ఏలినట్లు లభ్యమైన ఆనవాళ్లు
- ప్రముఖ చరిత్ర పరిశోధకుడు తుమ్మల దేవరావ్ పరిశోధనలో వెల్లడి



గుట్టపై 15వ శతాబ్దపు నాటి రోలు



మురిమడుగు గుట్టపై పురాతన ఆలయం

జన్నారం: మట్టి దిబ్బల కింద మహాచరిత్ర దాగి ఉంది. తొలి శాతవాహనులు ఏలినట్లు ఇక్కడి ఆనవాళ్లు చెబుతున్నాయి. 15 శతాబ్దంలో నిర్మించిన శివాలయం నేటికీ దర్శనమిస్తోంది. మంగళవారం ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు తుమ్మల దేవరావు ఆ ప్రాంతంలో పర్యటించి చరిత్ర ఆనవాళ్లున్నట్లు ప్రకటించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం మురిమడుగు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలోని కొండపై శాతవాహనులు ఏలినట్లు, 250 ఫీట్ల ఎత్తున, 30 ఫీట్ల వెడల్పుతో కోట ఏర్పాటు చేసుకుని పాలన సాగించినట్లు ఆనవాళ్లు లభ్యమయ్యాయి. కొండపై పురాతన శివాలయం ఇప్పటికీ ఉంది. సుమారు 2,500 ఏళ్ల క్రితం శాతవాహన రాజులు ఈ కోటను కేంద్రంగా చేసుకుని పాలించినట్లు తెలుస్తోంది. కోట లోపల గృహోపకరణాలు, పునాదులు, రాతి పనిముట్లు కనిపించాయి. కోట ప్రవేశ ద్వారంపై బౌద్ధస్తూపాన్ని పోలిన నిర్మాణాలున్నాయి. లోపల స్నానపు బావులు, నీటి బావుల అవశేషాలు కనిపిస్తున్నాయి. బావికి కాల్చిన మట్టితో చేసిన రింగులు వేసినట్లు ఉంది. నలుపు, ఎరుపు కుండ పెంకులు ఎక్కువగా ఉన్నాయి. మట్టిపూసలు, రాతి పలకలపై పూల డిజైన్లు, ఇటుకలు, ఇసురురాళ్లు, గాజు ముక్కలు, ఎముకలు, నూరు రాళ్లు, బలపపు రాళ్లు లాంటి అవశేషాలు లభించాయి.

15వ శతాబ్దపు శివాలయం

15 శతాబ్దంలో ఇక్కడి నుంచి పాలించిన శాతవాహన రాజుల కాలంలో నిర్మించిన శివాలయం నేటికీ ఉంది. బండరాళ్లతో నిర్మించిన ఇది శిథిలమైంది. ఇక్కడ ఏటా దీపావళి సందర్భంగా ఆదివాసీలు పూజలు చేసి దండారీ ఆడతారు. ఇప్పటికీ బోరమ్మ విగ్రహం ఆదివాసీల పూజలందుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విగ్రహం జైన యక్షినిని పోలి ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. తూర్పున తాళ్ల చెరువు, ఉత్తరాన గుండు చెరువు, కోట చుట్టూ 80 ఫీట్ల లోతుతో నీటి కందకాలు ఉన్నాయి. వీటిని పరిశీలిస్తే శత్రువుల బెడదతో ఈ కోటను రక్షణ స్థావరంగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది.

గోదావరి చుట్టూ బౌద్ధ నాగరికత

గోదావరికి సమీప ప్రాంతాలైన బాసర, కోటిలింగాల, బ్రహ్మేశ్వర్, బాదన్‌కుర్తి, దిలావర్‌పూర్ లాంటి బౌద్ధక్షేత్రాలను పోలిన బౌద్ధ నాగరికథ మురిమడుగు గుట్టపై కనిపిస్తోందని చరిత్ర పరిశోధకుడు తుమ్మల దేవరావు పేర్కొన్నారు. కోటిలింగాల క్షేత్రం వద్ద లభించిన పంచమార్కుడి నాణేల లాంటి అవశేషాలు ఇక్కడా లభించినట్లు తెలుస్తోంది. పురావస్తు శాఖ దృష్టి సారిస్తే మురిమడుగు గ్రామ శివారులోని గుట్టపై మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

పురావస్తుశాఖ దృష్టికి తీసుకెళ్తా



మురిమడుగు గ్రామ సమీప అటవీ ప్రాంతంలోని గుట్టపై శాతవాహనులు ఏలిన అనేక అవశేషాలు కనిపించాయి. గుట్టను కేంద్రంగా చేసుకుని పాలన కొనసాగించినట్లు తెలుస్తోంది. నేటికీ శివాలయం, బావులు, రుబ్బురోళ్లు కనిపిస్తున్నాయి. అవశేషాలు కాలగర్భంలో కలవక ముందే అధికారులు స్పందించి తవ్వకాలు చేపడితే మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. పురావస్తుశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తా. అద్భుతమైన కళాసంపదకు నిలయంగా ఉన్న మురిమడుగు గుట్టపై పరిశోధనలు జరపాలి.
– తుమ్మల దేవరావు, కవి, చరిత్ర పరిశోధకుడు

6,913వ రోజుకు డిస్మిసల్ కార్మికుల దీక్ష



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షురాలు రాధిక

మందమర్రిరూరల్: ఉద్యోగాలు కల్పించాలని మందమర్రి జీఎం ఆఫీస్ సమీపంలో డిస్మిసల్ కార్మికులు చేపట్టిన దీక్ష మంగళవారం 6,913వ రోజుకు చేరింది. దీక్ష శిబిరాన్ని సందర్శించిన డిస్మిసల్ కార్మిక సంఘం అధ్యక్షురాలు రామిళ్ల రాధిక వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డిస్మిసల్ కార్మికులకు ఉద్యోగాలు కల్పించే వరకూ ఆందోళనలు, దీక్ష విరమించేది లేదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో డిస్మిసల్ కార్మికులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చిన నాయకులు గెలిచిన తర్వాత విస్మరించారని విమర్శించారు. త్వరలోనే ఆందోళన కార్యక్రమాలు రూపొందిస్తామని, కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డిస్మిసల్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గోలేటి సీహెచ్‌పీకి అవార్డు



డైరెక్టర్ నుంచి అవార్డు తీసుకుంటున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీ ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. మంగళవారం సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు ఉత్తమ సీహెచ్‌పీగా ప్రకటించడంతో పాటు అవార్డు అందజేశారు. డైరెక్టర్లు గోలేటి సీహెచ్‌పీ నిర్వహణను పరిశీలించారు. వినియోగదారుడికి నాణ్యమైన బొగ్గు అందజేసేలా, ఉత్తమ డిస్పాచ్, రక్షణతో కూడిన నిర్వహణ, పచ్చదనంతో కూడిన పరిశుభ్రత, డీజీఎంఎస్ నిబంధనలకు అనుగుణంగా ఏరియా, సీహెచ్‌పీ అధికారులు దీనిని నిర్వహించడంతో అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈమేరకు కొత్తగూడెంలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ సత్యనారాయణరావు చేతుల మీదుగా ఏరియా ఏజీఎం తిరుమలరావు, సీహెచ్‌పీ ఇంజినీర్ రాజు, డీజీఎం సతీశ్‌బాబు అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

ఏరియాస్పత్రిని పరిశీలించిన డైరెక్టర్



పేషెంట్లతో మాట్లాడుతున్న డైరెక్టర్ బలరాం

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఏరియా ఆస్పత్రిని సంస్థ డైరెక్టర్ (ఫైనాన్స్) మంగళవారం సందర్శించారు. అన్ని వార్డులు తిరిగి రోగులకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా అసౌకర్యం కలగకుండా చూడాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఫార్మసీ స్టోర్‌ను పరిశీలించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా.. లేదా.. తెలుసుకున్నారు. ఇన్‌చార్జి జీఎం మధుసూదన్, ఎస్వోటూ జీఎం ఓదెలు, డీవైసీఎంవో ఉషారాణి పాల్గొన్నారు.

అన్‌ఫిట్ అయినవారికి సూటబుల్ జాబ్ ఇవ్వాలి



డైరెక్టర్ బలరాంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్: అండర్ గ్రౌండ్‌లో విధులు నిర్వహిస్తూ వివిధ కారణాలతో అన్‌ఫిట్ అయిన వారికి సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇవ్వాలని ఏఐటీయూసీ సబ్ కమిటీ మైనింగ్ స్టాఫ్ నాయకులు కోరారు. మంగళవారం వారు డైరెక్టర్ బలరాంను కలిసి డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేటీకే 8 ఇంక్‌లైన్‌లో జరిగిన గని ప్రమాదానికి ప్రకాశ్ అనే మైనింగ్ సర్దార్‌ని బాధ్యుడిని చేస్తూ డిస్మిస్ చేసిన యాజమాన్యం అతడిని తిరిగి విధుల్లోకి తీసుకొని సూటబుల్ జాబ్ కల్పించాలని డిమాండ్ చేశారు. అండర్ గ్రౌండ్‌లో విధులు నిర్వహిస్తున్న ఓవర్‌మన్లకు కౌన్సెలింగ్ ద్వారా ఓపెన్ కాస్టులలో విధులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సబ్ కమిటీ బెల్లంపల్లి ఏరియా రీజియన్ మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి వంగరి రాజేశ్వర్‌రావు, మందమర్రి ఏరియా ఇన్‌చార్జి గోపతి సత్యనారాయణ, శ్రీరాంపూర్ మారపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న ఎస్జీటీలు, పీఈటీలు

మంచిర్యాలఅగ్రికల్చర్: స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, పండితులు, పీఈటీలు, మిగిలిపోయిన ఎస్ఏలు, స్పౌస్ బదిలీలు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎస్జీటీలు, పీఈటీలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం స్పౌస్ బదిలీల ఉత్తర్వులు వెలవడేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

ట్రెజరర్ ఏడీని కలిసిన కమిషనర్



ట్రెజరరీ ఏడీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న మారుతీప్రసాద్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా ట్రెజరరీ అసిస్టెంట్ డైరెక్టర్ సంజయ్‌కుమార్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ కలిశారు. పెండింగు బిల్లులు విడుదల చేయాలని కోరారు. ఇటీవల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మారుతీప్రసాద్, మున్సిపాలిటీలోని ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులతో పాటు, వివిధ పనులకు సంబంధించిన బిల్లులు ఆలస్యం కావడంపై ఏడీకి వివరించి, సకాలంలో అందించేలా చూడాలని కోరారు. మున్సిపల్ మేనేజర్ కే విజయ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



ధర్నాలో మాట్లాడుతున్న సీతారామయ్య

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ గనులు, డిపార్ట్‌మెంట్లలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు వెంటనే నెరవేర్చాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు, కార్మికులతో కలిసి శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జీఎం సంజీవరెడ్డికి అందించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ.. కార్మికులకు వెంటనే సీఎంపీఎఫ్ చిట్టీలు పంపిణీ చేయాలన్నారు. కోల్ ఇండియాలో అమలవుతున్న హైపవర్ కమిటీ వేతనాలు సింగరేణిలో అమలు చేయాలని కోరారు. కార్మికులకు హాస్పిటల్ బుక్ ఇచ్చి కార్మికుడితోపాటు కుటుంబ సభ్యులకు కూడా ఇన్ పేషెంట్‌గా వైద్యసౌకర్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అక్బర్ అలీ, ప్రధాన కార్యదర్శి వైవీరావు, ఉపాధ్యక్షుడు ముస్కె సమ్మయ్య, నాయకులు బాజీ సైదా, వీరభద్రయ్య, మోతుకూరి కొమురయ్య, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి



ర్యాలీ ప్రారంభిస్తున్న సుబ్బారాయుడు

నస్పూర్: మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బారాయుడు తెలిపారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా నస్పూర్‌లోని షిర్కే కాలనీలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలేరియా నివారణకు దోమలు పుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిత, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయనిర్మల, అధికారులు అల్లాడి శ్రీధర్, నాందేవ్, దత్తు, నస్పూర్ మెడికల్ ఆఫీసర్ సమత పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జాతీయ రహదారుల పనులు త్వరగా పూర్తి చేయాలని రవాణా, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి విజయేంద్ర బోయి ఆదేశించారు. మంగళవారం ఢిల్లీ నుంచి కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాతీయ రహదారుల నిర్మాణ పనులపై కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి మాట్లాడుతూ.. జాతీయ రహదారుల పనులను పర్యవేక్షించాలని కలెక్టర్లను ఆదేశించారు. అటవీ, పర్యావరణ అనుమతులు పొందడంలో తలెత్తిన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడారు. మంచిర్యాల జిల్లాలో జాతీయ రహదారి 363 నిర్మాణంలో 44,200 కిలోమీటర్ల మేర మంచిర్యాల నుంచి రేపల్లెవాడ, జాతీయ రహదారి–63 నిర్మాణంలో 36.252 కిలోమీటర్ల మేర మంచిర్యాల నుంచి నిజామాబాద్ రహదారి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.